సాక్షి
ఏలూరు

శనివారం : 29 : జూలై : 2023



రోడ్డెక్కిన వేల్పూరు 'పంచాయితీ'
తణుకు మండలం వేల్పూరు పంచాయతీలో టీడీపీ బలపర్చిన పాలకవర్గం అక్రమాలు. అవినీతి చర్చనీయాంశంగా మారింది.

IIలో ▸



పాపికొండల్లో పెద్ద పులులు
పాపికొండలు అభయారణ్యం పులి గాండ్రింపులతో పులకిస్తోంది. ఇక్కడ నాలుగు పులులు, ఐదు చిరుతలు ఉన్నట్లు గుర్తించారు.

IIలో ▸

ఐటీడీఏ పీఓగా సూర్యతేజ


బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారిగా ఎం.సూర్యతేజ నియమితులయ్యారు. నరసాపురం సబ్ కలెక్టర్‌గా ఉన్న సూర్యతేజను ఐటీడీఏ పీఓగా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు వచ్చాయి.

న్యూస్‌రీల్

ఇళ్ల నిర్మాణాన్ని వేగిరపర్చాలి


మంత్రి జోగి రమేష్‌ను పూల మొక్క అందిస్తున్న హౌసింగ్ అధికారి

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లాలో ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ సూచించారు. తూర్పుగోదావరి జిల్లా పర్యటనకు వెళుతున్న ఆయన్ను డీఆర్‌డీఏ పీడీ, గృహనిర్మాణ శాఖ ఇన్‌చార్జి జిల్లా అధికారి ఆర్.విజయరాజు ఏలూరు సమీపంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ఇళ్ల నిర్మాణాల ప్రగతి తీరును మంత్రి అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకునేలా కృషిచేయాలని ఆదేశించారు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం


సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్: జిల్లాలో పోలీసు సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తామని జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి అన్నారు. స్థానిక పోలీస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం పోలీస్ సంక్షేమ దివస్ నిర్వహించారు. పలువురు సిబ్బంది తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ అన్నారు. సిబ్బంది ఇబ్బందులను తొలగించి మెరుగైన సేవలు అందించేలా చేయటమే పోలీస్ వెల్ఫేర్ డే లక్ష్యమన్నారు.

రికార్డుల కోసం డీఎల్‌పీఓ మెమో
దెందులూరు: దెందులూరు గ్రామ పంచాయతీలో పన్నుల దుర్వినియోగంపై ఫిర్యాదుల నేపథ్యంలో గ్రామ కార్యదర్శి యహోషువాకు డీఎల్‌పీఓ పి.చంద్రశేఖర్ నోటీసు, రికార్డులు ఇవ్వమని 15 రోజులైనా ఇవ్వకపోవడంతో మెమో జారీ చేశారు. పంచాయతీ ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులను రికార్డుల్లో నమోదు చేయడం లేదని, రసీదులు ఇవ్వడం లేదని స్పందనలో కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ జరుగుతుంటే అడ్డంకులు ఎదురవుతున్నాయి. దెందులూరు మండల ఈఓపీఆర్డీ ఫిర్యాదు వచ్చిన వెంటనే క్లోజ్ చేయడం ఒకటైతే.. రికార్డుల కోసం నోటీసు ఇచ్చి 15 రోజులు గడుస్తున్నా గ్రామ కార్యదర్శి అందించకపోవడం రెండోవది. ఈ క్రమంలో విచారణ ఆలస్యమవుతోంది. దీనిపై డీఎల్‌పీఓ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా దెందులూరు గ్రామ కార్యదర్శికి నోటీసులు, మెమో ఇవ్వడం వాస్తవమన్నారు.

మొక్కల సంరక్షణ తప్పనిసరి


మొక్క నాటుతున్న జేసీ లావణ్యవేణి

ద్వారకాతిరుమల: పుట్టినరోజు, పెళ్లిరోజు నాడు ప్రతిఒక్కరూ తప్పకుండా మొక్కలు నాటి, వాటిని సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ద్వారకా తిరుమల శ్రీవారి కొండపై, హరిత రిసార్ట్స్ ప్రాంగణంలో శుక్రవారం ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా లక్ష మొక్కలు నాటడం లక్ష్యం కాగా, ఇప్పటివరకు 16,300 మొక్కలు నాటారన్నారు. సర్పంచ్ కుంటం స్వర్ణలత, డ్వామా పీడీ ఎ.రాము, ఏపీ పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ స్వామి నాయుడు, జిల్లా పర్యాటక శాఖ అధికారి మెహరాజ్, ఎంపీడీఓ ఏవీ సుబ్బరాయన్, తహసీల్దార్ పి.సతీష్, దేవస్థానం ఈఈ భాస్కర్, వైఎస్సార్ సీపీ నాయకులు పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా ఆమె ముందుగా ఆమె క్షేత్రంలో స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేయించారు.

1 నుంచి ఎఫ్ఏ-1 పరీక్షలు
ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో వచ్చేనెల 1 నుంచి క్లాస్‌రూమ్ బేస్ట్ ఫార్మెటివ్-1 పరీక్షలు నిర్వహించాలని డీఈఓ పి.శ్యామ్ సుందర్ ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు ప్రశ్నాపత్రాలను శనివారం ఉదయం 10 గంటల నుంచి ఎంఈఓ కార్యాలయాల నుంచి తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు తప్పనిసరిగా 1 నుంచి 10వ తరగతి వరకూ ఫార్మెటివ్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

ఉధృతంగా గోదావరి



వేలేరుపాడు: రేపాకగొమ్ము నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న దృశ్యం

- రెండు మండలాల్లో 19 గ్రామాల ప్రజల తరలింపు
- తక్షణ చర్యలకు ఏలూరు జిల్లాకు రూ.3 కోట్లు, పశ్చిమకు రూ.2 కోట్ల మంజూరు
- కలెక్టర్లతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్
- లంక గ్రామాలను తాకుతూ వరద నీరు
- పోలవరం ప్రాజెక్ట్ నుంచి 11.55 లక్షల క్యూసెక్కులు దిగువకు..

పోలీస్ కంట్రోల్‌రూమ్ ఏర్పాటు
ఏలూరు టౌన్: గోదావరి వరదలు, వాగులు, ఏరుల వద్ద రక్షణ చర్యలు చేపట్టేందుకు కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి చెప్పారు. అత్యవసర సేవలకు ఏలూరు స్పెషల్ బ్రాంచ్ ఆఫీస్ 08812-230175 , 83329 59174 (కంట్రోల్ రూమ్), పోలవరం డీఎస్పీ శ్రీనివాసులు 73826 23680, కుక్కునూరు సీఐ 94407 96608, పోలవరం సీఐ 94407 96663లో సంప్రదించాలన్నారు.

సాక్షి ప్రతినిధి, ఏలూరు: గోదావరి వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. పోలవరం ప్రాజెక్ట్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరడంతో లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. దీంతో ముంపు ప్రాంతాలతో పాటు లంక గ్రామాల్లో వరద ప్రభావం మొదలైంది. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో 19 గ్రామాలు, పశ్చిమగోదావరి జిల్లాలోని రెండు లంక గ్రామాల్లోకి వరద నీరు చేరింది. మరోవైపు ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం వరద సహాయక చర్యల్లో పాల్గొంటూ బాధితులకు భరోసా ఇస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సహాయక చర్యల కోసం ఏలూరు జిల్లాకు రూ.3 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాకు రూ.2 కోట్లు మంజూరు చేసింది.

ఉపనదుల నుంచి భారీగా..

గోదావరితో పాటు పరీవాహక ప్రాంతంలోని ఉపనదుల నుంచి కూడా నీరు చేరడంతో తీవ్రత మరింత పెరిగింది. భద్రాచలం వద్ద శుక్రవారం సాయంత్రం 52 అడుగుల మేర నీరు చేరడంతో భారీగా దిగువకు విడుదల చేశారు. శనివారం కూడా వరద తీవ్రత కొనసాగుతుందని జలవనరుల శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. తెలంగాణతో పాటు ఎగువ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురవడం గోదావరి, శబరి నదుల నుంచి వరద నీటితో పోటెత్తుతోంది. శుక్రవారం రాత్రి 7 గంటల సమయానికి పోలవరం స్పిల్‌వే వద్ద 33.340 మీటర్ల ఎత్తు నుంచి దిగువకు 48 గేట్ల ద్వారా 11,55,833 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శనివారం ఉదయానికి భద్రాచలం వద్ద 60 అడుగులు దాటుతుందని అధికారుల అంచనా.

జలాశయాలకు ఉవ్వెత్తున..

ఏలూరు జిల్లాలోని ఎర్రకాల్వ, తమ్మిలేరు, జల్లేరు జలాశయాలు గరిష్ఠ నీటిమట్టానికి చేరాయి. ఎర్రకాల్వకు 3,360 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరింది. తమ్మిలేరు ప్రాజెక్టుకు 4,600 క్యూసెక్కుల నీరు చేరింది. జల్లేరు నుంచి 150 క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు. యలమంచిలి మండలంలోని కనకాయలంక గ్రామంలో కాజ్‌వే మునిగి ఇళ్ల చుట్టూ వరద నీరు చేరింది. ఆచంట మండలం అయోధ్య లంక గ్రామంలోకి వరద నీరు చేరడంతో సహాయక చర్యలు ప్రారంభించారు.

14 లక్షల క్యూసెక్కులకు చేరే అవకాశం


వరద పరిస్థితిపై చర్చిస్తున్న సీఈ సుధాకర్‌బాబు

పోలవరం రూరల్: గోదావరి వరద ఉరకలేస్తోందని, శుక్రవారం రాత్రికి పోలవరం ప్రాజెక్టు ప్రాంతానికి 14 లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరే అవకాశం ఉందని పోలవరం తహసీల్దార్ బి.సుమతి తెలిపారు. వరద పరిస్థితిపై పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో జలవనరుల శాఖ సీఈ సుధాకర్‌బాబు, ఎస్ఈ నరసింహామూర్తితో చర్చించామన్నారు. గోదావరిలో వరద పెరిగినా పోలవరం గ్రామానికి ఇబ్బంది లేదని, నెక్లెస్‌బండ్ పటిష్ట పరిచినట్టు చెప్పారు. ప్రాజెక్టు ప్రాంతంలో జలవనరులశాఖ అధికారులు అప్రమత్తంగా ఉన్నారన్నారు.

బాధితులకు అండగా ఉంటాం


రావికుంట పునరావాస కేంద్రంలో భోజనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

కుక్కునూరు: గోదావరి వరద బాధితులకు ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. శుక్రవారం రావికుంట పునరావాస కేంద్రంలో బాధితులను పరామర్శించారు. బాధితులకు నష్టపరిహారం అందేలా చూస్తానని, గత గోదావరి వరదలకు సంబంధించిన బిల్లులు కూడా జమ చేసేలా అధికారులతో మాట్లాడుతానన్నారు. బాధితులకు కూరగాయలు పంపిణీ చేశారు. భోజనాన్ని పరిశీలించారు. వైస్ ఎంపీపీ తాండ్ర రాజేష్, మండల అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు తదితరులు ఉన్నారు.

అధికారుల ఓదార్పు


బాధితులకు ధైర్యం చెబుతున్న డీపీఓ విశ్వనాథ్

వేలేరుపాడు: మండలంలో శివకాశీపురం, భూదేవిపేటలో, కుక్కునూరు మండలంలో దాచారం, నెమలిపేటలో సురక్షిత శిబిరాలను అధికారులు ఏర్పాటుచేశారు. ఇక్కడ బాధితులకు భోజనం, వసతి, తాగునీటి ఏర్పాట్లు చేశారు. చిన్నపిల్లలకు పోషకాహారం అందిస్తున్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటుచేశారు. అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయి. దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాలను వినియోగంలోకి తీసుకువచ్చారు. బాధితులకు కాచి చల్లార్చిన నీటిని అందిస్తున్నారు. వరద బాధితులను గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అధికారులు పరామర్శిస్తూ ధైర్యం చెబుతున్నారు. డీపీఓ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ శివకాశీపురం, ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన శిబిరంలోని బాధితులను కలిసి ఓదార్చారు. అనంతరం ప్రభుత్వ వసతి గృహంలోని గిరిజన బాలికలకు భోజనం వడ్డించి సహపంక్తి భోజనం చేశారు.

భయం గుప్పిట్లోనే..


వేలేరుపాడు: వరద బాధితులను తరలిస్తూ..

వేలేరుపాడు: మండలంలో గోదావరి వరద భయం వీడటం లేదు. తొమ్మిదో రోజు శుక్రవారం కూడా 33 గ్రామాలను వరద చుట్టిముట్టే ఉంది. పలు గ్రామాల్లో ఇళ్లకు చేరువలోకి నీరు చేరింది. అర్ధరాత్రికి వరద మరింత పెరిగే అవకాశముందని సీడబ్ల్యూసీ అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు 11 గ్రామాలను ఖాళీ చేయించి 1,052 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. మండలవ్యాప్తంగా మొత్తం 2,881 కుటుంబాలను వరద బాధితులుగా తేల్చారు. రుద్రమకోట, రేపాకగొమ్ము, తాట్కూరుగొమ్ము, తిర్లాపురం, పాతనార్లవరం, వేలేరుపాడు సంత బజారు, వేలేరుపాడు, సుద్దగుంపు, ఆసుపత్రి కాలనీ, శ్రీరాంపురం, నడిమిగొమ్ము తదితర గ్రామాలను అధికారులు ఖాళీ చేయించారు. వీరంతా తమ సామగ్రితో తరలివెళుతున్నారు. శ్రీరాంపురం గ్రామస్తులకు బండలబోరు పాఠశాలలో, నడిమిగొమ్ము, ఆసుపత్రి కాలనీ, సుద్దగుంపు గ్రామస్తులను శివకాశీపురం పునరావాస కేంద్రానికి తరలించారు. దిగువనున్న 15 గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొయిదా, టేకూరు, తూర్పుమెట్ట గ్రామాల్లో జనరేటర్లు ఏర్పాటుచేశారు. ఆయా గ్రామాల్లో ప్రజలకు కూరగాయలను పంపిణీ చేస్తున్నారు. 3,290 కిలోల ఉల్లిపాయలు, 1,645 కిలోల దొండకాయలు, 1,660 కిలోల దోసకాయలు, 412 కిలోల మిర్చి, 1,645 కిలోల వంకాయలు, 3,290 కిలోల బంగాళదుంపలు శనివారం పంపిణీ చేయనున్నారు. నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్ష్ రాజేంద్రన్, ఆర్డీఓ ఝాన్సీ పర్యవేక్షిస్తున్నారు.

పునరావాస కేంద్రాలకు తరలింపు


కుక్కునూరు: పునరావాస కేంద్రానికి వెళుతున్న కుక్కునూరు ఏ బ్లాక్ నిర్వాసితులు

కుక్కునూరు: కుక్కునూరు మండలంలో గోదావరిలో వదర ఉరకలేస్తోంది. మూడో ప్రమాద హెచ్చరికకు చేరువైంది. మండలంలోని కుక్కునూరు ఏ బ్లాక్‌లో 320, కౌండిన్యముక్తిలో 38, ఎల్లప్పగూడెంలో 47, ఆంబోతులగూడెంలో 47, చెరవు కొమ్ముగూడెంలో 160, శ్రీధరలో 7, అమరవరం పాతూరులో 10, ఎలకలగూడెంలో 70 కుటుంబాలను పునరావాస శిబిరాలకు తరలింపు ప్రక్రియ చేపట్టారు. వేలేరు-బూర్గంపాడు, వేలేరు-సీతారామనగరం, వెంకటాపురం క్రాస్ రోడ్డు నుంచి ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారులు నీటమునిగాయి. ఐటీడీఏ పీఓ సత్యనారాయణ మండలంలోని పునరావాస కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. వరద ఉధృతి పెరిగితే దాచారం, అర్వపల్లి, నెమలిపేట, గుండుగూడెం, గుండంబోరు, బెస్తగూడెం, సీతారామపురం, ఉప్పరమద్దిగట్ల గ్రామాలకు నిరంతరంగా విద్యుత్ సరఫరా కొనసాగించేలా విద్యుత్ శాఖాధికారులు చర్యలు తీసుకున్నారు. డీపీఓ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ రావికుంట పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు.



వేలేరుపాడు: వేలేరుపాడులో సామాన్లతో తరలివెళుతున్న వరద బాధితులు



కుక్కునూరు: వరదను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ సత్యనారాయణ



వేలేరుపాడు: రేపాకగొమ్ము గ్రామస్తులు ఇలా..

వరద తగ్గిన తర్వాత పంట నష్టం గణన

డీఆర్వో మూర్తి



వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో ఏవీఎస్ఎస్ మూర్తి

ఏలూరు(మెట్రో): జిల్లాలో వరద ప్రభావం తగ్గిన తర్వాత పంట నష్టాల గణన చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఏవీఎస్ఎస్ మూర్తి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా వరి తదితర పంటలు నీట మునిగాయని, పొలాల్లో ముంపు నీరు తగ్గిన తర్వాత పంట నష్టం గణన చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఈ-క్రాప్ బుకింగ్ చేపట్టామన్నారు. ధాన్యం కొనుగోలుకు గోనె సంచుల కొరత లేకుండా చూడాలని సభ్యులు కోరగా వెంటనే చర్యలు తీసుకోవాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆక్వాజోన్‌లో కొందరు ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ సొమ్ము జమ కావడం లేదని అన్నారు. సాగు నీటి కాలువల్లో కిక్కిస, గుర్రపు డెక్క, తూడు తొలగించాలని కోరారు.

ఆంధ్రా సుగర్స్‌కు సుగర్ కేన్ హార్వెస్టింగ్ పేటెంట్


భారత ప్రభుత్వం జారీ చేసిన పేటెంట్ సర్టిఫికెట్

తణుకు: తణుకులోని ఆంధ్రా సుగర్స్ సంస్థ జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించింది. 20 ఏళ్ల కాల వ్యవధికి గాను ఆంధ్రా సుగర్స్‌కు హార్వెస్టింగ్ మెషిన్ పేరుతో తమ ఆవిష్కరణకు సుగర్ కేన్ పేటెంట్ మంజూరు చేసింది. ఈ మేరకు భారత ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం ఈ నెల 26న పేటెంట్ సర్టిఫికెట్ జారీ చేసింది. సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ముళ్లపూడి నరేంద్రనాథ్ మార్గదర్శకత్వంలో సంస్థకు చెందిన సుగర్ కేన్ హార్వెస్టర్ డెవలప్‌మెంట్ టీం దీనిని నిర్మించడం, ఉపయోగించడం కోసం పదేళ్లుగా అంకిత భావంతో కృషి చేస్తోంది. భారతీయ వ్యవసాయ పరిస్థితులకు చెరకు హార్వెస్టర్ ఆవిష్కరణకు పేటెంట్ మంజూరైన సంస్థ దేశంలోనే మొదటిది ఆంధ్రా సుగర్స్ కావడం విశేషం.

వరదను సమర్థంగా ఎదుర్కొంటాం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



సీఎం జగన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

ఏలూరు(మెట్రో): జిల్లాలో వరదను సమర్థంగా ఎదుర్కొనేందుకు సహాయ, పునరావాస కార్యక్రమాలు పక్కాగా నిర్వహిస్తామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. రాష్ట్రంలో వరద పరిస్థితిపై శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా ఎస్పీ మేరి ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్వో ఏవీఎస్ఎస్ మూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు గతేడాది వరదల్లో ఇళ్లు దెబ్బతిన్న 1,280 కుటుంబాలకు పరిహారం అందించాల్సి ఉందన్న విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందిస్తూ సంబంధిత పరిహారాన్ని వెంటనే అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు ప్రస్తుతం వరద సహాయక చర్యలకు విడుదల చేసిన నిధులకు అదనంగా నిధులు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. జిల్లాలో వరద పరిస్థితిపై కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ముఖ్యమంత్రికి వివరించారు. వేలేరుపాడు, కుక్కునూరు మండలాలు, పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో వరద ప్రభావం ఉందన్నారు. 31 నివాసిత ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని, 2,700 కుటుంబాలపై వరద ప్రభావం పడిందన్నారు. బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు. ఆయా గ్రామాలకు మూడు నెలల ముందస్తు రేషన్ నిల్వలు అందుబాటులో ఉంచామని, నిత్యావసర సరుకులు, బియ్యం అందిస్తున్నామన్నారు. వరదల కారణంగా పూర్తిగా స్తంభించే గ్రామాల్లో ఏఎన్ఎం, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలను బాధితులకు బాసటగా నిలిచేందుకు అందుబాటులో ఉంచామన్నారు. 24 గంటలూ పనిచేసేలా కంట్రోల్ రూమ్‌లు, ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, ఫైర్ ఫైటింగ్ బృందాలు పనిచేస్తున్నాయన్నారు. పునరావాస కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు, 8 హ్యాండ్ బోర్లు ఏర్పాటుచేశామన్నారు. 5 లక్షల వాటర్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచామన్నారు. తమ్మిలేరు, జల్లేరుపై కూడా వరద ప్రభావం పడిందని, లోలైన్ బ్రిడ్జిలను దాటకుండా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలవరం నెక్లెస్ బండ్‌పై ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో 93 వేల ఎకరాల్లో వరినాట్లు పడగా ఇందులో 4,230 ఎకరాలు ముంపులో ఉన్నాయన్నారు. వ్యవసాయశాఖ అధికారి వై.రామకృష్ణ, ఇరిగేషన్ ఎస్ఈ కె.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎన్.సత్యనారాయణ పాల్గొన్నారు.

సమన్వయంతో స్వయం ఉపాధి

జిల్లాలో నిరుద్యోగ యువత స్వయం ఉపాధి దరఖాస్తులను అధికారులు, బ్యాంకర్ల సమన్వయంతో మంజూరు చేయాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో శుక్రవారం జిల్లా పారిశ్రామిక ఎగుమతులు ప్రోత్సాహక మండలి సమావేశం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఖాదీ గ్రామీణ పరిశ్రమల బోర్డుకు 86 మంది దరఖాస్తులు సమర్పించగా వాటిలో 45 దరఖాస్తులు బ్యాంకుల వద్ద పెండింగ్‌లో ఉండడం, 27 దరఖాస్తులను బ్యాంకులు తిరస్కరించడంపై అసహనం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ప్రసన్న కుమారి



ఉంగుటూరు : వంద రోజుల్లో 50 వేల బియ్యం గింజలపై శ్రీరామ నామాన్ని రాసినందుకు అభినందిస్తూ కైకరం గ్రామానికి చెందిన కూన ధనలక్ష్మి ప్రసన్న కుమారికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రశంసాపత్రం, మెడల్ బ్యాడ్జిని అందచేసింది. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలలు పబ్లిక్ హాలిడేస్, రెండో శనివారం, ఆదివారాలు విద్యార్థులకు ఎలాంటి తరగతులు నిర్వహించరాదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కే చంద్రశేఖర బాబు ఆదేశించారు. ఇంటర్మీడియట్ విద్యామండలి ఆదేశాలను విధిగా పాటించాలని, నిబంధనలు పాటించకపోతే అలాంటి యాజమాన్యంపై తగిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెలవు దినాల్లో కళాశాలకు హాజరు కావాలని కళాశాల యాజమాన్యం విద్యార్థులపై గానీ లేదా తల్లిదండ్రుల మీద గానీ ఎలాంటి ఒత్తిడి చేయరాదని సూచించారు. విద్యార్థులు సెలవు దినాల్లో హాజరు కాలేదని విద్యార్థులపై గానీ తల్లిదండ్రుల పైగానీ ఎటువంటి చర్యలు తీసుకున్నా ఆ కళాశాల యాజమాన్యాలపై కూడా క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పాపికొండల్లో పెద్దపులులు

నేడు అంతర్జాతీయ పులుల సంరక్షణ దినోత్సవం

- నాలుగు పులులు, ఐదు చిరుతలు ఉన్నట్లు గుర్తింపు
- ప్రభుత్వ చర్యలు, ప్రజల్లో చైతన్యంతో స్వేచ్ఛగా సంచరిస్తున్న వైనం



బుట్టాయగూడెం: పులి గాండ్రింపులతో అడవి తల్లి పులకిస్తోంది. జీవవైవిధ్యం పరిమళిస్తోంది. నడకలో రాజసం, వేటలో గాంభీర్యంతో అడవికి రారాజుగా వెలుగొందే పెద్ద పులుల సంఖ్య రాష్ట్రంలో పెరుగుతుంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, ప్రజల్లో అవగాహన వెరసి పెద్ద పులుల సంఖ్య పెరిగింది. ఏలూరు జిల్లా పాపికొండలు అభయారణ్యం పరిధిలో మరిన్ని పులుల కదలికలు గుర్తించారు. అభయారణ్యంలో సుమారు నాలుగుకు పైగా పులులు, ఐదు పైగా చిరుతలు ఉన్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు.

ట్రాప్ కెమెరాకు చిక్కిన పులులు, చిరుతలు

పాపికొండల అభయారణ్యం ఏలూరు, అల్లూరి, భద్రాది జిల్లాల అటవీ ప్రాంతాల మధ్య ఉంది. మొదట్లో 590 హెక్టార్ల పరిధిలో ఉన్న అటవీ ప్రాంతం మాత్రమే రిజర్వ్ ఫారెస్టుగా ఉండేది. 2008లో ఈ ప్రాంతాన్ని వన్యప్రాణి సంరక్షణ కోసం అభయారణ్య ప్రాంతంగా గుర్తించారు. ఈ అభయారణ్యాన్ని జాతీయ పార్క్‌గా గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మూడు జిల్లాల పరిధిలో అటవీ ప్రాంతాల మధ్య 1,12,500 హెక్టార్లకు ఈ అభయారణ్యాన్ని పెంచిన కేంద్ర ప్రభుత్వం దీనిని జాతీయ పార్క్‌గా మార్చాలని నిర్ణయం తీసుకుంది. అప్పటి నుంచి ఈ అభయారణ్యంతో పాటు జంతు సంరక్షణపై ప్రభుత్వం, ఫారెస్టు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అడవి తల్లి ఒడిలో గాండ్రింపులతో పులులు స్వేచ్ఛగా తిరుగుతున్నాయి. 2014లో అటవీ శాఖ అధికారులు పులులు సంచరిస్తున్నట్లు గుర్తించారు. గోదావరి పరీవాహక ప్రాంతంలోని తెల్ల దిబ్బలు తదితర ప్రాంతాల్లో రాత్రి వేళ పులి గాండ్రింపులు విన్నట్లు ఆ ప్రాంత ప్రజలు చెబుతున్నారు.

నవంబర్–ఏప్రిల్ మధ్య పునరుత్పత్తి

పెద్ద పులి 18 నుంచి 20 సంవత్సరాలు బతుకుతుంది. పులి పిల్లలు తల్లి నుంచి మూడు నుంచి నాలుగు సంవత్సరాల వరకూ వేట, ఈత నేర్చుకుంటాయి. మగ పులి నాలుగేళ్ల తర్వాత తల్లి నుంచి వేరైపోతుంది. ఆడ పులి మాత్రం తల్లి దగ్గరే ఉంటుంది. ఆడ పులి గర్భం దాల్చిన 93 నుంచి 113 రోజుల్లో ప్రసవిస్తుంది. అడవిలో పెద్ద పులి ప్రతీ రోజూ 25 కిలోమీటర్ల దూరం వరకూ తిరుగుతుంది. చెట్ల మొదళ్లలో గోళ్లతో గీరి మూత్రం పోసి గుర్తు పెట్టుకుంటుంది. సాధారణంగా నవంబర్– ఏప్రిల్ మధ్య పులుల పునరుత్పత్తి ఎక్కువగా ఉంటుంది. ఆడ పులి కలయికకు కొన్ని రోజులు మాత్రమే అనుకూలంగా ఉంటుంది. గర్భధారణ సమయం 16 వారాలు ఉంటుంది.

ఒంటరిగానే జీవనం

పులి సంచరించే ప్రాంతాన్ని పెద్ద పులి టెరిటరీగా భావిస్తారు. ఆడ పులి తన నివాస స్థావరాన్ని సుమారు 20 చదరపు కిలోమీటర్ల మేర ఎంచుకుంటుంది. మగ పులి 60 నుంచి 100 చదరపు కిలోమీటర్లు వరకు ఉండేలా తన నివాస స్థావరాన్ని ఎంచుకుంటుంది. ఇవి జీవించే ప్రాంతాల్లోకి తనకు హాని కలిగించే మరే ఇతర జంతువు కూడా ప్రవేశించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటాయి.

2022లో పులుల గణన

2009–10 మధ్య కాలంలో బుట్టాయగూడెం మండలం ఇనుమూరు, చింతలగూడెం, అంతర్వేదిగూడెం అటవీ ప్రాంతంలో పులుల అడుగులను ఫారెస్టు అధికారులు గుర్తించారు. పశువులపై పులి దాడి చేసిన సంఘటనలు జరిగాయి. 2019లో పులులు సంచరిస్తున్నట్లు గుర్తించిన ఫారెస్టు అధికారులు అటవీ ప్రాంత గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. 2022లో చేసిన పులుల గణన కార్యక్రమంలో పులుల జాడ ట్రాప్ కెమెరాకు చిక్కాయి.




పాపికొండల అభయారణ్యంలో ట్రాప్ కెమెరాలకు చిక్కిన పెద్ద పులి, చిరుతలు

పులుల సంరక్షణ అందరి బాధ్యత

జీవ వైవిధ్యానికి ప్రధాన ఆధారంగా నిలుస్తున్న పులుల్ని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. పులులు కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. మనిషి దురాశకు పులులు బలైపోతున్నాయని వరల్డ్ వైల్డ్ లైఫ్ గణంకాలు చెబుతున్నాయి. పులులను కాపాడుకునేందుకు అవి సంచరించే అభయారణ్యంలో వన్యప్రాణుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు 2010 నుంచి ప్రతీ ఏటా జూలై 29న వరల్డ్ టైగర్స్‌డే నిర్వహిస్తున్నారు.

డాక్టర్ కావాలంటే నిత్య విద్యార్థిగా ఉండాలి

ఉండ్రాజవరం: డాక్టర్ కోర్సు చదవాలంటే చదువుతో పాటు క్రమశిక్షణ, ధైర్యం కావాలని శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ అన్నారు. నీట్–2023లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వేలివెన్ను శశి ఆధ్వర్యాన రాజమహేంద్రవరంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏటా తమ విద్యా సంస్థ నుంచి 200 మందికి తగ్గకుండా మెడికల్ సీట్లు సాధిస్తున్నారని చెప్పారు. ఈ విద్యా సంవత్సరం కూడా 300 సీట్లు వచ్చే అవకాశం ఉందన్నారు. వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ చాన్సలర్ కోరుకొండ బాబ్జీ, వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ జాయింట్ రిజిస్ట్రార్ వీవీ సుబ్బారావు, సాగర్ హస్పిటల్ వైద్యుడు పి.రవికిరణ్, శశి అకాడమిక్ డైరెక్టర్ శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

ఉండి: బాలికను లైంగిక వేధింపులకు గురి చేసిన ఘటనలో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం పాందువ్వ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన గులిపల్లి వెంకటేష్ ఈ నెల 28న ఉదయం 9 గంటలకు ఆమె ఇంట్లోకి వెళ్లి చేయిపట్టుకుని వేధింపులకు గురి చేశాడు. దీనిపై బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలిక మృతి

సాక్షి, భీమవరం: టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని కొవ్వాడ పుంతలో అనుమానాస్పద స్థితిలో బాలిక మృతిచెందినట్లు టూటౌన్ ఎస్సై అప్పారావు చెప్పారు. కొవ్వాడపుంతకు చెందిన బొండాడ మధురకృష్ణ కుమార్తె బొండాడ అమృత వర్షిణి(16) గురువారం రాత్రి ఇంటిలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని మరణించిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హుండీలో నగదు చోరీ

మొగల్తూరు : మొగల్తూరులోని లాకు వద్ద ఉన్న వినాయకుడి ఆలయంలోను, కుక్కలవారితోటలోని చెట్టుకింద ముత్యాలమ్మ ఆలయంలోని హుండీలను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టేందుకు ప్రయత్నించారు. చెట్టుకింద ముత్యాలమ్మ ఆలయ హుండీ తెరుచుకోకపోగా, వినాయకుని ఆలయంలోని హుండీ తలుపులు పగలగొట్టి అందులోని నగదును ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం స్థానికులు గమనించి ఆలయ నిర్వాహకులకు సమాచారం అందించగా హుండీలోని నగదు దొంగిలించినట్లు గుర్తించారు. ఆలయ నిర్వాహకులు మొగల్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కవితల పోటీల్లో ప్రథమ బహుమతి

పాలకొల్లు సెంట్రల్ : విశాఖపట్నంకు చెందిన సాహితీ ప్రవంతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి అభ్యుదయ మినీ కవితల పోటీల్లో పట్టణానికి చెందిన రసధుని సాహితి సంస్థ సహాయ కార్యదర్శి, కవి మామిడిశెట్టి శ్రీనివాసరావుకు ప్రథమ బహుమతి లభించింది. రెండు రోజులు క్రితం విశాఖపట్నంలో ఈ పోటీలు జరిగాయి. శ్రీనివాసరావు మాట్లాడుతూ పెనుగాలులకు అతలాకుతలమైన రైతు దుర్భరస్థితిని వర్ణిస్తూ.. సేద్యపు మడులలో స్వేదనదులై ప్రవహించి ఈ దేశానికి అన్నం పెట్టే రైతన్నను ఆకలి కేకల బారి నుంచి కాపాడి వాడి ఆకుపచ్చని కలను నిజం చేద్దాం అంటూ సాగిన కవిత అన్నారు.

కుక్క కోసం గొడవపడుతుండగా గుండెపోటు

ఏలూరు టౌన్ : పక్కింటి వారి కుక్క తమ ఇంటి ఆవరణలోకి వచ్చిందని గొడవ పడుతూ ఆకస్మాత్తుగా గుండెపోటుతో ఒక వ్యక్తి మృత్యువాత పడ్డాడు. ఏలూరు టూటౌన్ పరిధిలోని రజక పేటలో తుపాకుల నాగేశ్వరరావు (70) తన పక్కింటికి చెందిన కుక్క తన ఇంటి ఆవరణలోకి రావడంతో గొడవపడ్డాడు. వారితో గట్టిగా అరుస్తూ ఆవేశానికి గురి కావటంతో గుండెపోటు వచ్చింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా మృతిచెందాడు. ఈ సంఘటనపై ఏలూరు టూటౌన్ ఎస్‌ఐ బీ.నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చైన్ స్నాచింగ్‌కు యత్నం

ఆకివీడు: ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు దొంగతనానికి ప్రయత్నించిన ఘటన పెదకాపవరం గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. సచివాలయం సమీపంలో ఉంటున్న వృద్ధురాలు కఠారి రమణమ్మ తెల్లవారుజామున లేచి బయటకు వచ్చిన సమయంలో ఆమె మెడలో చైన్ లాగేందుకు యువకుడు ప్రయత్నించాడు. ఆమె కేకలు వేయడంతో రాయితో ఆమె తలపై కొట్టి గాయపరచాడు. ఆమె బంగారు గొలుసును గట్టిగా పట్టుకొని కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వస్తున్నట్లు తెలుసుకుని ఆ యువకుడు పరారయ్యాడు.

ఉద్యోగం ఇప్పిస్తానని రూ.11 లక్షల మేర మోసం

పాలకోడేరు: ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేశారనే ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం ఉంగుటూరు మండలం కైకరం గ్రామానికి చెందిన ధంపనబోయిన శ్రీనివాస కృష్ణ అయ్యప్పన్ భార్య, తల్లి, తండ్రిలు దగ్గర బంధువులైన పాలకోడేరు గరువుకు చెందిన మల్లుల వీర వెంకట పార్వతి, భర్త లక్ష్మీ శ్రీనివాస్‌ను కలిసి కాణిపాకం దేవస్థానంలో అటెండర్ పోస్టులు ఉన్నాయని ఇప్పిస్తామని చెప్పి రూ.11 లక్షల తీసుకుని మోసం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

దాడి కేసులో ఆరుగురిపై అట్రాసిటీ కేసు



బాధితుడు సురేష్ వీపుపై గాయాలు

ద్వారకాతిరుమల : కోళ్లు దొంగిలించారనే నెపంతో ముగ్గురు వ్యక్తులపై దాడిచేసి, కులం పేరుతో దూషించిన ఆరుగురిపై ద్వారకాతిరుమల పోలీస్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిమ్మాపురానికి చెందిన మురుగుల దుర్గారావుకు చెందిన నాటు కోళ్లు ఇటీవల చోరీకి గురయ్యాయి. వాటిని గ్రామానికి చెందిన మనెల్లి దుర్గాప్రశాంత్ దొంగిలించాడని దుర్గారావు భావించాడు. దాంతో అతడు ఈనెల 25న రాత్రి తన కోళ్ల మాకం వద్దకు దుర్గాప్రశాంత్‌ను తీసుకెళ్లాడు. అప్పటికే అక్కడున్న అదే గ్రామానికి చెందిన అప్పసాని ధర్మారావు, కొనకళ్ల అప్పారావు, ఆచంట రాకేష్, ఘంటా శేఖర్, తోకల సిద్ధిరాజు దుర్గారావుతో కలిసి అతడిపై దాడి చేశారు. అతని బట్టలు విప్పి, కటింగ్ ప్లేయర్‌తో మర్మాంగాన్ని నొక్కిపట్టి దారుణంగా ప్రవర్తించారు. ఆ తరువాత అదే గ్రామానికి చెందిన ముప్పిన సురేష్, అరటి కట్ల రాంబాబులను సైతం అక్కడకు తీసుకొచ్చి వారిపై కూడా దాడి చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఈనెల 27న ముప్పిన సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, అదే రోజు ధర్మారావు, అప్పారావులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రాథమిక విచారణ అనంతరం శుక్రవారం ఎఫ్ఐఆర్‌ను మార్చి రాకేష్, శేఖర్, సిద్ధిరాజు, దుర్గారావులపై సైతం ఎస్సీ, ఎస్టీ, పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డెక్కిన వేల్పూరు 'పంచాయితీ'

టీడీపీలో పెరుగుతున్న అసమ్మతి రాగం



వేల్పూరులో నిరసన దీక్షలు చేపట్టిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

తణుకు: తణుకు మండలం వేల్పూరు పంచాయతీ వ్యవహారం రోడ్డెక్కింది. తెలుగు దేశం పార్టీ బలపరిచిన పంచాయతీ పాలకవర్గం చేస్తున్న అక్రమాలు, అవినీతి సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. ఈనెల 27న 'కొటేషన్లు పెంచేసి... అడ్డంగా బొక్కేసి!' శీర్షికతో సాక్షిలో వచ్చిన కథనంతో ఈ వ్యవహారం రోడ్డున పడింది. ఇప్పటికే పంచాయతీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై దృష్టి సారించిన ఉన్నతాధికారులు విచారణ చేపడుతుండగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు శుక్రవారం నుంచి గ్రామంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలతో మరింత రాజుకుంది. పాలకవర్గం పగ్గాలు చేపట్టిన నాటి నుంచి తెలుగుదేశం పార్టీలోని కొందరు నాయకులు పంచాయతీలో చొరబడి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో గత ప్రత్యేక అధికారి పాలనలో గ్రామంలో వివిధ సామాజిక వర్గాలకు కేటాయించిన సామాజిక భవనాల నిర్మాణాలు అడ్డుకున్న పంచాయతీ పాలకవర్గం కోర్టును ఆశ్రయించడంతో వివాదం ముదిరింది. ఆయా సామాజిక వర్గాలకు చెందిన గ్రామస్తులు టీడీపీ నేతలు చేస్తున్న వ్యవహారంపై పెదవి విరుస్తున్నారు. దీంతో టీడీపీ నాయకులు జరిగిన నష్టాన్ని పూడ్చుకునే పనిలో పడ్డారు. వేల్పూరు పంచాయతీలో 18 వార్డులు ఉండగా 2021లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో తెలుగుదేశం బలపర్చిన 11 మంది సభ్యులు విజయం సాధించగా వైఎస్సార్‌సీపీ బలపర్చిన ఏడుగురు సభ్యులు గెలుపొందారు. దీంతో విశ్వనాథం కృష్ణవేణి సర్పంచిగా బాధ్యతలు చేపట్టారు. ఆమె సర్పంచిగా వ్యవహరిస్తున్నప్పటికీ పంచాయతీ వ్యవహారాలన్నీ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులే చూస్తున్నారు. ఇదిలా ఉంటే పంచాయతీ బోర్డు ఏర్పాటు చేసిన నాటి నుంచి తెలుగుదేశం శ్రేణులు వ్యవహరిస్తున్న తీరుతో విసుగెత్తిపోతున్న అదే పార్టీలోని వార్డు సభ్యులు అసమ్మతి రాగం అందుకున్నారు. ఇటీవల నాలుగో వార్డు సభ్యురాలు రమాదేవి పంచాయతీలో జరుగుతున్న వ్యవహారంపై బహిరంగంగా విమర్శిస్తూ విడుదల చేసిన వాయిస్ మెసేజ్ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పంచాయతీ వ్యవహారాల్లో టీడీపీ నేతలు జోక్యం పెరుగుతోందని.. దీనిపై పార్టీ పెద్దలు దృష్టి సారించాలని పేర్కొంటూ ఆమె విడుదల చేసిన వాయిస్ మెసేజ్ సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

సంక్షేమానికి ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి



తణుకులో వైఎస్సార్‌సీపీలో చేరిన మహిళలతో మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పారదర్శకంగా అందిస్తున్న సంక్షేమ పాలనకు ప్రజలు అండగా నిలుస్తున్నారని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు పాతవూరుకు చెందిన వివిధ పార్టీలకు చెందిన మహిళలు శుక్రవారం దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలు మనుబర్తి లలిత ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ కుల, మత, వర్గ విభేదాలు లేకుండా అన్ని వర్గాలకు సమానంగా అందుతున్న సంక్షేమానికి ప్రజలు మొగ్గు చూపుతున్నారని అన్నారు. పార్టీని నమ్మిన వారికి పార్టీ ఎప్పుడూ అండగా నిలబడుతుందని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ కుటుంబంలో చేరిన ప్రతి మహిళ తమ ప్రాంతంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషిచేయాలని సూచించారు. జగనన్న అందిస్తున్న సంక్షేమంతో రాష్ట్రంలో పేదరికం తగ్గుతుందని కేంద్రం విడుదల చేసిన గణాంకాల ప్రకారం మిగిలిన రాష్ట్రాల కన్నా తక్కువగా ఉందన్నారు. జగనన్న ఆలోచనలకు అనుగుణంగా పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని కోరారు. ఎలాంటి అవసరమున్నా తనను నేరుగా కలవాలని కోరారు. ముందుగా పార్టీలో చేరిన మహిళలకు మంత్రి కారుమూరి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, అత్తిలి మండల మహిళాధ్యక్షురాలు కాకర్ల విశాలాక్షి, సామంతుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రంలో దుకాణాల నిర్వహణకు వేలం

గతేడాది కంటే భారీగా పెరిగిన ఆదాయం



శ్రీవారి కల్యాణ మండపంలో బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్న దేవస్థానం అధికారులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ తూర్పు ప్రాంతంలోని పలు దుకాణాలను లీజుకు ఇచ్చేందుకు ఆలయ అధికారులు స్వామివారి కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం బహిరంగ వేలం పాట నిర్వహించారు. రెండేళ్ల కాలపరిమితికి జరిపిన ఈ వేలం పాటల ద్వారా స్వామికి విశేష ఆదాయం సమకూరింది. అందులో భాగంగా షాపు నెంబర్ 10లో కూల్ డ్రింక్స్ షాప్ నిర్వహణకు వెజ్జు సత్యవాణి (చంద్రశేఖర్) నెలకు రూ.1.42 లక్షలకు హెచ్చుపాట పాడారు. గతేడాదితో పోలిస్తే దేవస్థానానికి ఈ షాపు ద్వారా నెలకు రూ.68,300 ఆదాయం పెరిగింది. షాపు నెంబర్ 11లో ఫ్యాన్సీ, జనరల్ ఐటమ్స్ విక్రయించుకునేందుకు పాదిలి నాగేశ్వర కుమార్ నెలకు రూ.1.55 లక్షలకు హెచ్చుపాట పాడారు. గతేడాదితో పోలిస్తే ఈ సారి ఈ షాపుకు రూ.71,400 పెరిగింది. షాపు నెంబర్ 19లో అవే ఐటమ్స్ విక్రయించుకునేందుకు కోరుప్రోలు సత్యనారాయణ నెలకు రూ.1.10 లక్షలకు హెచ్చుపాట పాడారు. దీని ద్వారా గతేడాది కంటే ఈసారి రూ.37,400 ఆదాయం పెరిగింది. షాపు నెంబర్ 20లో ఫ్యాన్సీ ఐటమ్స్ విక్రయించుకునేందుకు కోరుప్రోలు సూరిబాబు నెలకు రూ. 1.15 లక్షలకు హెచ్చుపాట పాడారు. గతేడాది కంటే రూ.46,800 పెరిగింది. షాపు నెంబర్ 23లో అవే ఐటమ్స్ విక్రయించుకునేందుకు మహంకాళి సర్వేశ్వరరావు నెలకు రూ. 2.16 లక్షలకు సీల్డ్ టెంబర్ వేసి, పాటను దక్కించుకున్నారు. గతేడాది కంటే ఈసారి రూ. 22,400 పెరిగింది. షాపు నెంబర్ 24లో అవే ఐటమ్స్ విక్రయించుకునేందుకు వీసం నాగరాజు నెలకు రూ. 1.80 లక్షలకు హెచ్చుపాట పాడారు. గతేడాది కంటే రూ.11,087 పెరిగింది. శివాలయం వద్ద షాపు నెంబర్ 1లో కొబ్బరి కాయలు, పూజా సామాగ్రి విక్రయాలకు వేలంలో నెలకు రూ.71 వేల ఆదాయం లభించింది. గతేడాదితో పోలిస్తే ఈ షాపు ద్వారా దేవస్థానానికి రూ. 22,600 ఆదాయం పెరిగింది. వేలం పాటలను నిర్వహించిన వారిలో ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు, సూపరింటెండెంట్ రమణరాజు తదితరులున్నారు.

వర్షాల నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తం

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ ఉపకరణాలు, కనెక్షన్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వితేజ్ ఇమ్మడి సూచించారు. వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలను పర్యవేక్షించడానికి జిల్లా కేంద్రాలలో ఉన్న సూపరింటెండింగ్ ఇంజినీర్ల కార్యాలయాలు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నియంత్రణలో ప్రత్యేక పర్యవేక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఉన్న టోల్ ఫ్రీ నంబర్ 1912కు అదనంగా ఈ కేంద్రాలు పనిచేస్తాయని వివరించారు. తుపాను లేదా భారీ వర్షాల వల్ల విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయాలకు సంబంధించిన మరమ్మతు పనులు పూర్తయ్యేంత వరకూ నిరంతరం ఈ పర్యవేక్షణ కేంద్రాలు పనిచేస్తాయని సీఎండీ స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం, ఇతర సరఫరా సంబంధిత సమస్యలు పరిష్కరించేందుకు వివిధ సర్కిళ్ల పరిధిలో ఉన్న అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని విద్యుత్ వినియోగదారులకు సీఎండీ సూచించారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు సంబంధించి సూపరింటెండింగ్ ఇంజనీర్, ఆపరేషన్ సర్కిల్ నెంబరు 9440812702 లో సంప్రదించవచ్చు.